క్లుప్తంగా

వేములూరు పంచాయతీలో విచారణ

కొవ్వూరు: మండలంలోని వేములూరు పంచాయతీలో నిధులు దుర్వినియోగం అయ్యాయంటూ ఆ పంచాయతీ ఏడో వార్డు సభ్యుడు పోకనాటి సత్యనారాయణ లోగడ లోకాయుక్తకు చేసిన ఫిర్యాదుపై ఇన్‌చార్జ్ డీఎల్‌పీవో జి.సతీష్ మంగళవారం విచారణ చేపట్టారు. జిల్లా పంచాయతీ అధికారి నుంచి వచ్చిన ఆదేశాల మేరకు విచారణ చేస్తున్నామన్నారు. గతేడాది మార్చి 23న లోకాయుక్తకు ఇచ్చిన ఫిర్యాదులోని అంశాలపై పంచాయతీ రికార్డులను తనిఖీ చేస్తున్నట్టు ఇన్‌చార్జ్ డీఎల్‌పీవో తెలిపారు. అప్పట్లో పనిచేసిన పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్ నుంచి వాంగ్మూలాలు తీసుకుంటామన్నారు. నివేదికను జిల్లా పంచాయతీ అధికారికి పంపించనున్నట్టు సతీష్ తెలిపారు.

మండల ప్రత్యేకాధికారిగా సత్యగోవింద్


సత్యగోవింద్

గోపాలపురం: మండల ప్రత్యేకాధికారిగా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ ఎస్‌టీజీ సత్యగోవింద్ మంగళవారం గోపాలపురంలో బాధ్యతలు స్వీకరించారు. మండల పరిషత్ కార్యాలయం ద్వారా జరిగే అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని ఆయన చెప్పారు. ఎంపీడీఓ ఆర్. శ్రీదేవి, సూపరింటెండెంట్ కె. రాజ్‌మనోహర్ ఇతర సిబ్బంది ప్రత్యేకాధికారిని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

ఘనంగా సుధీంద్రబాబు జయంతి

ఉండ్రాజవరం: అవధూత, ఆధ్యాత్మిక గురువు సుధీంద్రబాబు జయంతిని ఉండ్రాజవరంలోని ఆయన ఆశ్రమంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధార్మిక ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రాంగణంలో అన్న సమారాధన చేశారు. కార్యక్రమానికి తణుకు, ఉండ్రాజవరం, పెరవలి ప్రాంతాల నుంచి సుమారు 2,000 మంది హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు.

తెల్లదోమ నివారణపై రైతులకు అవగాహన

నల్లజర్ల: కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటల్లో తెల్లదోమ వ్యాప్తి, లక్షణాలు, నివారణపై మండలంలోని దూబచర్ల, అనంతపల్లి గ్రామాల రైతులకు క్షేత్రస్థాయి అవగాహన కల్పించారు. ఉద్యాన శాఖ, 3 ఎఫ్ సంస్థ, కొవ్వూరు అరటి పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. శాస్త్రవేత్తలు, ఉద్యానశాఖ అధికారుల ఆధ్వర్యంలో తెల్లదోమ వ్యాప్తి, తీవ్రతను సర్వే చేస్తున్నట్టు నల్లజర్ల ఉద్యాన శాఖాధికారి శ్రీలక్ష్మి రైతులకు తెలిపారు. నులి పురుగుల శాస్త్రవేత్త డాక్టరు కిశోర్ మాట్లాడుతూ తోటలపై వేపనూనె పిచికారీ, పసుపు రంగు జిగురు అట్టలు, టార్పాలిన్లు ఏర్పాటు చేయడం ద్వారా తెల్లదోమ వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. వేపనూనె పిచికారీ విధానం, ఎన్ కార్పియో బదనికలను వదలడం ద్వారా తెల్లదోమ వ్యాప్తిని నివారించవచ్చన్నారు. ఉద్యానశాఖాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ పసుపు రంగు జిగురు అట్టలను, టార్పాలిన్ల వాడకం ద్వారా రెక్కల పురుగులు, తెల్లదోమ తల్లి పురుగుల ఉధృతిని తగ్గించవచ్చన్నారు.ఈ కార్యక్రమంలో రైతులు కలం సత్యనారాయణ, బళ్ళ ప్రభాకరరావు, గద్దే వెంకన్నబాబు, గన్నమని మధుమోహన్, అవిర్ని రామకృష్ణ, రైతు భరోసా కేంద్రాల సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

ఈత సరదా.. తెస్తోన్న వ్యధ

- సరదాగా గోదావరి, కాలువల్లో స్నానాలు
- జాగ్రత్తలు పాటించని పిల్లలు
- మోగుతున్న మృత్యు ఘంటికలు

నిడదవోలు రూరల్: వేసవి వచ్చిందంటే చాలు పిల్లలు, పెద్దలు అనే బేధం లేకుండా సమీప గోదావరి నదిలో, కాలువల్లో, చెరువుల్లో ఈత కొడుతూ సేద తీరుతుంటారు. ఈత తెలిసిన వారికి సరదానే. ఈత రాని వారు మాత్రం ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ క్రమంలో వేసవి వస్తే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందే పరిస్థితి. విద్యార్థులకు కూడా ప్రస్తుతం సెలవులు ఇచ్చారు. దీంతో విద్యార్థుల కదలికలపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. సెలవుల్లో బయటకు వెళ్లే పిల్లలే అధికం. విరామ సమయంలో చిన్నారులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తే వారి భవిష్యత్తు, ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి ప్రమాదాల నుంచి పిల్లలను కాపాడడానికి పెద్దలు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరముంది. నిడదవోలు, పెరవలి, కొవ్వూరు గోష్పాద క్షేత్రం, విజ్జేశ్వరం బ్యారేజ్, తాళ్లపూడి మండలాల్లో వేసవిలో విద్యార్థులతో పాటు సందర్శకులు కూడా గోదావరి నదిలో స్నానాలు చేస్తూ ఆటలాడుతుంటారు. ఇలా స్నానాలు చేసే వారిలో కొందరు ప్రమాదవశాత్తూ నీట మునిగి మృత్యువాత పడుతున్నారు. కన్నవారికి గర్భశోకం మిగుల్చుతున్నారు. ప్రస్తుతం కాలువలన్నింటినీ మూసివేశారు. దీంతో నీటిని గోదావరిలోకి విడిచి పెట్టనున్నారు. ఈ సమయంలో లంక పొలాల్లోకి వెళ్లే రైతులు, కూలీలు, స్నానాలు చేసే యువకులు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అప్రమత్తంగా లేకపోతే పెను ప్రమాదాలు తప్పవు.

సరదా యువకుల ప్రాణం తీస్తోంది

ఈత సరదా వలంల ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారు. ఏటా గోదావరి తీరంలో అనేక మంది ఈ విధంగా మృత్యువాత పడుతున్నారు. సెలవుల్లో మధ్యాహ్నం, సాయంత్రాల్లో, పాఠశాలలు తెరిచివున్నపుడు ఆదివారాలు వచ్చాయంటే చాలు ఈ ప్రాంతంలోని ప్రమాదకర ప్రదేశాల్లో స్నానాలకు దిగి ప్రాణాలు కోల్పోతున్నారు. ఈనెల 22న కొవ్వూరులో రాజీవ్ కాలనీకి చెందిన ఉషశ్రీ (15) గోదావరిలో స్నానానికి దిగి గల్లంతైంది. నిడదవోలు మండలం పెండ్యాల వద్ద రెండేళ్ల క్రితం ఇద్దరు యువకులు స్నేహితులతో కలిసి గోదావరిలో స్నానానికి దిగి ప్రమాదవశాత్తూ జారిపడి మృతి చెందారు. అదే ఏడాది పెరవలి మండలం కాకరపర్రులో ముగ్గురు యువకులు మృతి చెందగా, నిడదవోలు మండలం పందలపర్రు ర్యాంపులో టెన్త్ పరీక్షలు రాసి వచ్చిన ఇద్దరు విద్యార్థులు సరదాగా గోదావరిలో స్నానానికి దిగి నీట మునిగి చనిపోయారు.


శెట్టిపేట కాలువలో స్నానం చేస్తున్న బాలలు

చిన్నారులు ఇలా చేయాలి..

వేసవిలో గ్రామాల్లోని కాలువలు, నది ఈత కొట్టే వారితో కనిపిస్తాయి. తెలియని వారికి ఈత నేర్పించేలా చేస్తే ప్రమాదం నుంచి కాపాడిన వారమవుతాం. ఈత నేర్చుకోవడం ఆరోగ్యానికి కూడా ఎంతో మంచిది. స్నానానికి దిగేటపుడు వంతెనలు, గట్టు ఒడ్డు నుంచి తలకిందులుగా నీటిలోకి దూకకూడదు. పక్కనున్న రాళ్లకు, గట్టి నేలకు తలకొట్టుకుంటే దెబ్బలు తగులుతాయి. ఒక్కోసారి ప్రాణాలు కోల్పోయే అవకాశం కూడా ఉంది. చెరువుల్లో దిగేముందు లోతు, నాచు, ఊబి గురించి తెలుసుకోవాలి. లేకుండా ఈత వచ్చినా ప్రమాదంలో చిక్కుకుంటారు. పిల్లలు ఈతకు వెళ్లినపుడు వీలైనంత వరకూ తల్లిదండ్రులు పిల్లలకు ప్రమాదకరమైన విషయాలను తెలియజేయాలి. ఖాళీ సమయంలో నిత్యం చదివే పాఠ్యాంశాల పుస్తకాలతో పాటు విజ్ఞానదాయకమైన పుస్తకాలను చదివించేలా ప్రోత్సహించాలి. ఈత సరదా, క్రికెట్ వంటి ఎండల్లో ఆటలను నిలువరించి, వారి దృష్టిని వేరే వ్యాపకాలపై మళ్లించాలి. ఇంటి వద్ద నీడపట్టునే ఉండే చదరంగం, క్యారమ్స్ తదితర ఆటలు ఆడుకునేలా ప్రోత్సహించాలి.


పెండ్యాల వద్ద గోదావరిలో గల్లంతైన అయినం సాయి గణేష్ మృతదేహాన్ని తీసుకువస్తున్న స్థానికులు(ఫైల్)

వెంటనే ప్రథమ చికిత్స చేయాలి



నీటిలో మునిగిన వ్యక్తిని ఒడ్డుకు చేర్చి నోటిని తెరిచి శుభ్రం చేయాలి. ఊపిరితిత్తుల్లో నీరు చేరిందా లేదా గమనించాలి. ఊపిరితిత్తుల్లో నుంచి శ్వాస రాకుంటే ఛాతీపై చేతులతో గట్టిగా ఒత్తాలి. ఇలా చేయడం వల్ల ఊపిరితిత్తుల నుంచి నీరు బయటకు వచ్చి శ్వాస మెరుగుపడుతుంది. ప్రథమ చికిత్స చేస్తుండగానే వైద్య సిబ్బందికి సమాచారం అందించి స్థానిక ఆసుపత్రులకు తీసుకువెళ్లాలి.

–ఎ.అమరేంద్ర, పీహెచ్‌సీ వైద్యాధికారి, సమిశ్రగూడెం

తల్లిదండ్రులే బాధ్యత తీసుకోవాలి



గోదావరి, కాలువల్లో పిల్లలను స్నానాలకు పంప కూడదు. ఎవరైనా ఈత రాకుండా స్నానాలకు వస్తే వారిని బలవంతంగా స్నానాలకు దింప కూడదు. వేసవి సెలవుల్లో చిన్నారులను ఇంటి వద్దే ఉండేలా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలి. ప్రమాదకరమైన ప్రదేశాల్లో స్నానాలను నిషేధించాలి.

– కె.వెంకటేశ్వరరావు, సీఐ, నిడదవోలు

రేవుల వద్ద హెచ్చరిక బోర్డులు


వేగేశ్వరపురంలో గోదావరి రేవు వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

తాళ్లపూడి: స్నానాల కోసం గోదావరి నదిలోకి దిగే వారు జాగ్రత్తలు తీసుకోవాలని తాళ్లపూడి ఎస్సై కె. వెంకట రమణ సూచించారు. ఈ మేరకు మండలంలోని గోదావరి రేవుల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడకు వచ్చిన వారికి నదిలో లోతు తెలియక ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందన్నారు. మండలంలోని రేవుల వద్ద ప్రమాదాల నివారణకు బోర్డులు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సభ్యులు వీరే..


నగళ్లపాటి శ్రీనివాస్


వరిగేటి సుధాకర్

కొవ్వూరు: స్థానిక ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులుగా వైఎస్సార్ సీపీ పట్టణ శాఖ గౌరవాధ్యక్షుడు నగళ్లపాటి శ్రీనివాస్, పట్టణానికి చెందిన వరిగేటి సుధాకర్ నియమితులయ్యారు. వారు బుధవారం ఉదయం 10 గంటలకు సీహెచ్‌సీలో ప్రమాణ స్వీకారం చేస్తారు.ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్, రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని వారు తెలిపారు.

గూడెంలో ముగిసిన జగనన్నే మా భవిష్యత్తు

దేవరపల్లి: ఈ నెల 7న ప్రారంభించిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం చిన్నాయగూడెంలో మంగళవారం ముగిసినట్టు వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కూచిపూడి సతీష్, గృహ సారథుల మండల కన్వీనర్ కుసులూరి వెంకట సతీష్ తెలిపారు. 21 గ్రామ సచివాలయాల పరిధిలో 314 మంది గ్రామ వలంటీర్లు, 63 మంది సచివాలయ కన్వీనర్లు, 628 మంది గృహ సారథులు 27,719 గృహాలను సందర్శించినట్టు వెంకట సతీష్ తెలిపారు.

నిడదవోలు రూరల్: రాష్ట్రంలో జగనన్న నాయకత్వానికి ప్రజల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తోందని వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు అన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు మంగళవారం మండలంలోని తిమ్మరాజుపాలెంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. సీఎం వైఎస్ జగన్ పాలనపై లబ్ధిదారుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, సర్పంచ్ ముప్పిడి చంద్రశేఖర్, ఎంపీటీసీ సభ్యుడు పడాల రంగారావు, సొసైటీ అధ్యక్షుడు యాళ్ల రామారావు, ఆ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు పడాల శ్రీనివాస్, కార్యదర్శి కారింకి బాబీ నాయకులు పాల్గొన్నారు.


చిన్నాయగూడెంలో ప్రజా మద్దతు పుస్తకాలను మండల కన్వీనర్‌కు అందిస్తున్న గృహ సారథులు

పెరవలి: మండలంలోని కడింపాడులో సర్పంచ్ దేవరపు శ్రీహరి ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ఇంటింటా జరిగింది. వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షులు తోట దుర్గాప్రసాద్, గృహ సారథులు, వలంటీర్లు, పార్టీ కార్యకర్తలు, వలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

ధాన్యం రేటులో మిల్లర్లు కోత పెడుతున్నారు

- తహసీల్దార్‌కు రైతుల ఫిర్యాదు

తాళ్లపూడి: ధాన్యాన్ని మిల్లుకు తరలించాక అవి నాణ్యంగా లేవంటూ, ముక్క అవుతోందంటూ మిల్లర్లు తమను ఇబ్బంది పెడుతున్నారని మండలంలోని పలువురు రైతులు వాపోయారు. బల్లిపాడు, మలకపల్లి, పెద్దేవం గ్రామాల నుంచి పలువురు రైతులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని దీనిపై తహసీల్దార్ టి.రాధికకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రైతులు చామర్తి భగవాన్, మద్దుకూరి రమేష్, చెరుకూరి వెంకటరావు, ముప్పన పల్లి సత్యనారాయణ, బత్తిన సత్యనారాయణ, పోతురెడ్డి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆర్‌బీకే ద్వారా ఇచ్చిన ట్రక్ షీట్‌తో వాహనాల్లో మిల్లుకు ధాన్యాన్ని తరలిస్తున్నామన్నారు. అయితే మిల్లర్లు మాత్రం ధాన్యం నూక అవుతోందని చెప్పి బస్తాకు రూ.100 వరకూ రేటు తగ్గించి ఇస్తున్నారని తెలిపారు. అందుకు తాము అంగీకరించకపోతే ధాన్యాన్ని దింపుకోవడం లేదని ఫిర్యాదు చేశారు. దీనిపై రైస్‌మిల్లర్ల సంఘం డివిజన్ నాయకుడు సింహాద్రి జనార్దనరావు మాట్లాడుతూ ధాన్యం నూక అవడం వాస్తవమే అన్నారు. రైతులను ఇబ్బంది పెట్టే ఉద్దేశం లేదన్నారు. నూకల నష్టాన్ని ప్రభుత్వం భర్తీ చేయాలని కోరుతున్నట్టు తెలిపారు. అధికారులతో రైస్ మిల్లర్ల సంఘం చర్చలు జరుపుతుందన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభంజనాన్ని ఏ శక్తీ అడ్డుకోలేదు

- కోటి కుటుంబాల సర్వే పూర్తి
- 79 లక్షల కుటుంబాల నుంచి మిస్డ్ కాల్స్
- విలేకరుల సమావేశంలో గోపాలపురం ఎమ్మెల్యే తలారి

ద్వారకాతిరుమల: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభంజనాన్ని ఏ శక్తీ అడ్డుకోలేదని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఆయన పార్టీ నేతలతో కలసి మెగా పీపుల్స్ సర్వే కరపత్రాలను ప్రదర్శించారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. ఈనెల 7 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 15 వేల సచివాలయాల పరిధిలో జగనన్నే మా భవిష్యత్తు పేరుతో పీపుల్స్ సర్వే చేపట్టామన్నారు. ఈ సర్వేలో 7 లక్షల మంది పార్టీ సైనికులు పాల్గొంటున్నారని, ఇప్పటి వరకూ కోటికి పైగా కుటుంబాలను సర్వే చేయగా జగనన్నకు మద్దతుగా 79 లక్షల కుటుంబాల నుంచి మిస్డ్ కాల్స్ వచ్చాయన్నారు. ఈనెల 29 లోగా రాష్ట్రంలోని 1.65 లక్షల కుటుంబాలను సందర్శించడమే వైఎస్సార్ సీపీ లక్ష్యమన్నారు. ఈ సర్వే నివేదికలు చూసి విపక్ష టీడీపీలో వణుకు మొదలైందన్నారు. గతంలో ఏ ప్రభుత్వమైనా ఒక్కో కుటుంబానికి ఇన్ని సంక్షేమ పథకాలు అందించిందా? అని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎంపీపీ బొండాడ మోహిని, జెడ్పీటీసీ సభ్యుడు చిగురుపల్లి శామ్యూల్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, స్థానిక సర్పంచ్ కుంటం స్వర్ణలత, పలువురు ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.


మెగా పీపుల్స్ సర్వే కరపత్రాన్ని చూపుతున్న ఎమ్మెల్యే తలారి తదితరులు

ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

ద్వారకాతిరుమల: తమ ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బుట్టాయిగూడెంలో రూ. 21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనాన్ని, గుళ్లపాడులో రూ. 5 లక్షలతో నిర్మించిన మంచినీటి బోరును, నారాయణపురంలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. అలాగే గుళ్లపాడులో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బొండాడ మోహిని, జెడ్పీటీసీ సభ్యుడు చిగురుపల్లి శామ్యూల్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, సర్పంచ్‌లు పెద్దిన దిలీప్, కేతా వెంకట నాగ సుబ్రహ్మణ్యం, దాకారపు బంగారమ్మ తదితరులు పాల్గొన్నారు.


బుట్టాయిగూడెంలో రైతు భరోసా కేంద్రం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తలారి

అదనపు మోటార్లతో మంచినీటి ఎద్దడి నివారణ

- దేవరపల్లి ఎంపీపీ దుర్గారావు
- మండల పరిషత్ సమావేశంలో పలు అంశాలపై చర్చ

దేవరపల్లి: వేసవిలో మంచినీటి ఎద్దడి నివారణకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎంపీపీ కేవీకే దుర్గారావు అన్నారు. దేవరపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం సాయంత్రం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. గత సమావేశంలో సభ్యులు, సర్పంచుల నుంచి వచ్చిన విజ్ఞాపనల పరిష్కార నివేదికలు, గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల ప్రగతిని అధికారులు సమావేశంలో వివరించారు. ఎంపీపీ కేవీకే దుర్గారావు మాట్లాడుతూ ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున మంచినీటి ఎద్దడి తలెత్తకుండా ప్రతి పంచాయతీకి అదనపు మోటార్ కొనుగోలుకు నిధులు మంజూరు చేశామన్నారు. సర్పంచులు వెంటనే మోటార్లను కొనుగోలు చేసి సిద్ధంగా ఉంచాలన్నారు. ఎండీయూ వాహనదారులు రేషన్ కార్డుదారులకు రేషన్ సరుకులు తక్కువగా తూకం వేస్తున్నట్టు ఫిర్యాదులు ఉన్నాయన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ఎం.రామకృష్ణకు సూచించారు. ఎంపీడీఓ కె. ఉమామహేశ్వరశర్మ మాట్లాడుతూ గ్రామాల్లో మంచినీటి ఎద్దడి లేకండా కార్యదర్శులు జాగ్రత్త వహించాలన్నారు. యాదవోలు సర్పంచ్ వరప్రసాద్ మాట్లాడుతూ తమ గ్రామంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరైనా కాంట్రాక్టర్ ఇంత వరకూ పనులు ప్రారంభించలేదన్నారు. గడప గడపకూ నిధులు రూ.40 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి పంచాయతీ తీర్మానం ఇచ్చి నెలలు గడుస్తున్నా పనులు జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ సచివాలయ భవనం, ఆర్‌బీకే కేంద్ర భవనం నిర్మాణం పునాదుల్లోనే ఉన్నాయన్నారు. తహసీల్దార్ ఎం.రామకృష్ణ మాట్లాడుతూ గ్రామాల్లో రీసర్వే జరుగుతున్నందున రైతులు సహకరించాలని కోరారు. ఏవో కె.విజయ్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన అకాల వర్షానికి మండలంలో 100 టన్నుల ధాన్యం తడిసాయన్నారు. ఆ ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, వైస్ ఎంపీపీలు కె.అరుణ, సాదే సుబ్బారావు, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ దుర్గారావు

మలేరియా అంతానికి కలసి నడుద్దాం

- నివారణ దినోత్సవం సందర్భంగా పలుచోట్ల అవగాహన ర్యాలీలు

నల్లజర్ల: మలేరియా రహిత సమాజమే లక్ష్యంగా అందరం కలసి నడుద్దాం.. మలేరియా నుంచి విముక్తి పొందుదాం అంటూ నల్లజర్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది ప్రజలకు సూచించారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మండలంలోని ఆవపాడులో ఆ గ్రామస్తులతో కలసి మంగళవారం వారు అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ డాక్టర్ తెల్లం గంగాధరరావు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, సిబ్బంది ర్యాలీలో పాల్గొన్నారు.

గోపాలపురం: మలేరియా నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ మండలంలోని హుకుంపేట పీహెచ్‌సీ ఉద్యోగులు మంగళవారం ఆ గ్రామంలో ర్యాలీ చేశారు. పీహెచ్‌సీ వైద్యుడు జె.శ్రీనివాస్, సిబ్బంది బీవీవీ దుర్గాభవాని, సీహెచ్ రత్తమ్మ, టి.ప్రసాద్, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: స్థానిక పీహెచ్‌సీ పరిధిలో వైద్యురాలు ఉషారాణి ఆధ్వర్యంలో మలేరియా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఎం.సుబ్రహ్మణ్యం, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

దేవరపల్లి: మలేరియా వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ హర్షవర్ధన్ ఆధ్వర్యంలో దేవరపల్లిలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ అప్పారావు, సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పెరవలి: మండలంలోని కానూరులో పీహెచ్‌సీ వైద్యురాలు పి. తేజశ్రీ ఆధ్వర్యంలో ఆ పీహెచ్‌సీ సిబ్బంది గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు హేమరాజు, సూపర్ వైజర్లు సందాని, సత్యేంద్ర కుమార్, రాజసులోచన,నాగేశ్వరరావు వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


నల్లజర్ల మండలం ఆవపాడులో అవగాహన ర్యాలీలో వైద్యఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది

చాగల్లు: బ్రాహ్మణగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నిశిత, డాక్టర్ దేవి ఆధ్వర్యంలో ఈ పీహెచ్‌సీలో మంగళవారం మలేరియా వ్యాధిపూ అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆరోగ్య విస్తరణాధికారి సీహెచ్ శ్రీనివాస్, ఎం.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కలవలపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.సౌజన్య ఆధ్వర్యంలో ఆ గ్రామంలో అవగాహన ర్యాలీ జరిగింది.

నేడు, రేపు ఆధార్ ప్రత్యేక శిబిరాలు

ఉండ్రాజవరం: మండలంలో బుధ, గురువారాల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ ఎ. శ్రీనివాసు మంగళవారం తెలిపారు. బుధవారం చివటం, వడ్లూరు సచివాలయాల్లోను, గురువారం దమ్మెన్ను, సత్యవాడ గ్రామ సచివాలయాల్లో ఈ శిబిరాలు నిర్వహిస్తారన్నారు. ఈ శిబిరంలో ఆధార్ సేవలు, ఆధార్ మొబైల్ నంబర్ లింకేజీ, బయో మెట్రిక్, పుట్టినరోజు తేదీ మార్పు, ఆధార్ అప్డేట్ వంటివి చేస్తారన్నారు.

చెరువులో ఎకరం స్థలం రజకులకు అప్పగించాలి

- ఉమ్మడి జిల్లాల రజక సంఘం అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య

గోపాలపురం: ప్రభుత్వం చేతి వృత్తులను ప్రోత్సహించాలని, రజకులకు కేటాయించిన చెరువులను వారికి అప్పగించాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రజక సంఘం అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య డిమాండ్ చేశారు. మండలంలోని గుడ్డిగూడెం, హుకుంపేట, చెరుకుమిల్లి గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కట్లయ్య మాట్లాడుతూ 1973లో హుకుంపేట గ్రామంలోని వీర్రాజు చెరువులో రజకులకు ఎకరం కేటాయించారన్నారు. ఈ మేరకు 1979లో అప్పటి జిల్లా కలెక్టర్ ఆదేశాలు కూడా జారీ చేశారన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ వీర్రాజు చెరువును అధికారులు రజకులకు అప్పగించకుండా తాత్సారం చేశారన్నారు. దీనిపై కట్లయ్య మంగళవారం మండల పంచాయతీ విస్తరణాధికారి కె సురేష్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఆ చెరువులోని ఎకరం భూమిని అప్పగిస్తామని ఈఓపీఆర్డీ సురేష్ బాబు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు వి శ్రీనివాస్, కె సుబ్బయ్య, లింగాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

శంకర జయంత్యుత్సవాలు ప్రారంభం

కొవ్వూరు: ఆదిశంకరాచార్యులు జయంతి మహోత్సవాలు స్థానిక గౌతమీ నగర్‌లోని శంకర మఠంలో మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉదయం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. అనంతరం నోరి భోగేశ్వరశర్మ సోమయాజి బ్రహ్మసూత్ర శంకర భాష్య పఠనం చేశారు. సాయంత్రం ఐదు గంటలకు మల్లాది కల్యాణ్‌కుమార్‌చే సౌందర్యలహరి పారాయణ జరిగింది. శంకర విజయం అనే అంశంపై గోరిగంతు భాస్కర వెంకట సుబ్రహ్మణ్యం ప్రవచనం చేశారు. స్థానిక భక్తులు పూజల్లో పాల్గొన్నారు. పాలకోడేటి సత్యనారాయణ మూర్తి, జీబీవీ సుబ్రహ్మణ్యం, సీహెచ్ సుబ్రహ్మణ్యం తదితరులు పూజలు నిర్వహించారు. ఈ నెల 29 వరకు ఈ ఉత్సవాలను నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

కోటసత్తెమ్మ ఆలయ ప్రాంగణంలో..

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెంలోని కోటసత్తెమ్మ ఆలయ ప్రాంగణంలో ఆది శంకరాచార్యుని జయంతి వేడుకను ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం (శివ) ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. శంకరాచార్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు గాజుల రంగారావు, అయినీడి వెంకటకృష్ణ, రేలంగి మారుతి శివభాస్కరరావు, దేవులపల్లి రవిశంకర్, ఆలయ ప్రధానార్చకుడు అప్పారావు శర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


కొవ్వూరు గౌతమీనగర్‌లోని శంకర మఠంలో పూజలు చేస్తున్న పండితులు

తేమ శాతం పేరుతో రైతులను ఇబ్బంది పెట్టవద్దు


కోమటికుంట రైసుమిల్లులో ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

గోపాలపురం: ధాన్యంలో తేమ శాతం ఉందని రైతులను ఇబ్బంది పెట్టకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి కె.మాధవరావు మిల్లర్లకు సూచించారు. మండలంలోని కోమటికుంట గ్రామంలోని మాతంగి తల్లి రైసుమిల్లును మంగళవారం జిల్లా అధికారులు సందర్శించారు. అక్కడున్న ధాన్యంలోని తేమ శాతానికి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవరావు మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షానికి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుందన్నారు. తనిఖీలలో పౌరసరఫరాల శాఖ ఏడీ జె. త్రినాథ్, డీఎస్‌ఓ కె ప్రసాద్, వ్యవసాయం శాఖ ఏడీ కె.చంద్రశేఖర్, ఏవో బి. రాజారావు పాల్గొన్నారు.